

ప్రగతిబాట



షిప్‌యార్డ్ కాలనీలోని రోడ్డు దుస్థితి



ఆధునీకరించిన రహదారి



40వ వార్డులో అధ్వానంగా రోడ్డు



సుందరంగా వేసిన రోడ్డు

- 40వ వార్డులో అభివృద్ధి పరుగులు
- మౌలిక వసతుల కల్పన భేష్
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 40వ వార్డులోని పలు ప్రాంతాల రూపురేఖలు మారాయి. మట్టిరోడ్లు, శిథిల మార్గాల్లో రాకపోకలకు సాగించలేక ప్రజలు అవస్థలు పడేవారు. అత్యవసరమైనా.. ఆస్పత్రికి చేరుకోవాలన్నా ఆటోలు, అంబులెన్స్‌లు ఆ వీధుల్లోకి చేరుకోలేని పరిస్థితి. నేడు అలాంటి రోడ్లకు మహర్దశ వచ్చింది, వీధుల్లో సైతం అంతర్గత రోడ్లు అద్దంలా మెరుస్తున్నాయని, ఇదంతా కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దక్షతోనే సాధ్యపడిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


సింథియా: టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లు సరిగ్గా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ చూసినా సిమెంట్, తారురోడ్లు అద్దంలా దర్శనమిస్తున్నాయి. దీంతో ఎలాంటి అంతరాయం లేకుండా రోడ్లపై ప్రజలు, వాహనచోదకులు హాయిగా ప్రయాణం సాగిస్తున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ 40వ వార్డులో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమస్యలను వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు వివరించేవారు. అభివృద్ధిపై దృష్టి సారించిన ఆనంద్‌కుమార్ నూతన రోడ్లకు ప్రణాళికలు సిద్ధం చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. దీనికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో సీసీ రోడ్లు, డ్రైనేజీలను త్వరితగతిన నిర్మించారు. దీంతో ప్రభుత్వ పనితీరుపై హర్షం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి...

గతంలో 40వ వార్డులోని రోడ్లు గుంతలతో, పిక్కతేలి అధ్వానంగా ఉండేవి. పలు చోట్ల కేబుల్ వైర్లు, ఇంటర్‌నెట్ కోసం తవ్విన గోతులు సరిగ్గా పూడ్చకపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యను తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు చొరవ తీసుకుని అధికారులతో చర్చించి, త్వరితగతిన నూతన రోడ్లు నిర్మించారు.



వాంబే కాలనీ గృహ సముదాయాల వద్ద దుస్థితి



చక్కగా వాంబే కాలనీ గృహ సముదాయాలు

అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధులు

- ➡ యువత కోసం రూ. 36 లక్షలతో ఉచిత జిమ్ ఏర్పాటు
- ➡ రాజీవ్ గృహాల మరమ్మతులు రూ. 18 లక్షలు
- ➡ వాంబే గృహాల మరమ్మతులు రూ. 80 లక్షలు
- ➡ ఏకేసీకాలనీలో రూ.96 లక్షలతో వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు
- ➡ ఏకేసీకాలనీలో రూ.12 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు
- ➡ షిప్‌యార్డ్‌కాలనీలోని పాత శివాలయం వరకు రూ.39 లక్షలతో నూతన రోడ్ల నిర్మాణం.

మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతాం



సమస్య ఎక్కడ ఉన్నా తక్షణం **పరిష్కరించే** విధంగా కృషి **చేస్తున్నాం. ఎన్నికల్లో** ఇచ్చిన **హామీలను శతశాతం** పూర్తి **చేశాం. వార్డులో** రోడ్ల దుస్థితి**ని స్వయంగా** గమనించి సమస్యలను పశ్చిమ **సమన్వయకర్త** ఆడారి ఆనంద్‌కుమార్ ద్వారా **ఉన్నతాధికారుల**కు తెలియపరిచి యుద్ధప్రాతిపది**కన రోడ్ల ఆధునికీకరణ**కు చర్యలు తీసుకున్నాం. **40వ వార్డును మోడల్** వార్డుగా తీర్చిదిద్దుతాం.

– గుండపు నాగేశ్వరరావు, 40వ వార్డు కార్పొరేటర్

రోడ్ల సమస్య తీరింది



మా వార్డులో రోడ్ల సమస్య తీరింది. గతంలో శిథిలమైన రోడ్లపై ప్రయాణించాలంటే భయమేసేది. రాత్రి వేళల్లో ప్రయాణం చేయలేక వాయిదా వేసుకునే వాళ్లం. వర్షం పడితే గుంతో నీరు నిల్వ ఉండిపోయి పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. ఇప్పుడు ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందుల లేవు.

– అన్నెపు సత్యనారాయణ, 40వ వార్డు

సాఫీగా ప్రయాణిస్తున్నాం



గతంలో వ్యాపారం నిమిత్తం ఈ రోడ్డుపై ప్రయాణం చేసేవాడిని. రహదారి సరిగ్గాలేక వ్యాపారం మానుకునే పరిస్థితి ఏర్పడింది. తాజాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి తర్వాత రోడ్లు నిర్మాణం పూర్తి చేయడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. మళ్లీ వ్యాపారం ప్రారంభించాను.

– జామి కృష్ణారావు, 40వ వార్డు

అండగా ఉంటా..


ఆటోలో ఉన్న బాధితుడి వద్దకు వెళ్లి అనారోగ్య సమస్య తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం ప్రాంతానికి చెందిన రమణ అనే వ్యక్తికి రెండు కాళ్లపై దద్దుర్లు రావడంతో నడవలేకపోతున్నాడు. అతడికి వైద్యం చేయాలంటే అధిక మొత్తంలో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో రమణ కుటుంబం ఆదుకునే చేతుల కోసం ఎదురు చూశారు. అయితే 59వ వార్డు నక్కవానిపాలెంలోని పార్టీ కార్యాలయానికి ఆనంద్‌కుమార్ వస్తున్నారని తెలుసుకుని తన భార్యను వెంటబెట్టుకుని ఆటోలో పార్టీ కార్యాలయానికి శనివారం చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న ఆనంద్‌కుమార్ ఆటోలో ఉన్న బాధితుడు రమణ వద్దకు వెళ్లారు. ఆయన సమస్య తెలుసుకుని అండగా ఉంటాను అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. షీలానగర్ వద్ద గల ఐకాన్ ఆస్పత్రికి వెళ్లి వైద్య ఖర్చులకు ఎంత అవుతుందో అంచనా వేసుకుని వస్తే అవసరమైన సాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటానని వారికి భరోసా కల్పించారు.

చీఫ్ వార్డెన్‌గా ఈశ్వర్‌కుమార్ నియామకం


ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఈశ్వర్‌కుమార్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల అసోసియేట్ డీన్‌గా ఏయూ ఫార్మశీ కళాశాల ఆచార్యుడు కె.ఈశ్వర్‌కుమార్ నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ నుంచి ఆయన శనివారం ఉత్తర్వులు స్వీకరించారు.

క్లుప్తంగా

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు


పద్మనాభనగర్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు ఎన్ని అందాయో వివరించారు. కార్యక్రమంలో సాలాపు మారయ్య, కంపర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పరిస్థితులపై సర్వే

సింథియా: సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పారిశ్రామిక ప్రాంతంలో సర్వే నిర్వహించారు. యూనిట్–1 ఆధ్వర్యంలో 63వ వార్డు క్రాంతినగర్‌లో, యూనిట్–2 ఆధ్వర్యంలో 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో, యూనిట్–3 ఆధ్వర్యంలో 62వ వార్డు త్రినాథపురంలో దాదాపు 3000 కుటుంబాలను సుమారు 150 మంది వలంటీర్లు వ్యక్తిగతంగా కలిశారు. వారి జీవన ప్రమాణాలు, స్థితి గతులపై ఆరా తీశారు. కార్యక్రమాల్లో అధ్యాపకులు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, , లక్ష్మి, తులసీ, లక్ష్మీదేవి, అంజిలీదేవి పాల్గొన్నారు.

గోపాలపట్నంలో పోలీసుల కవాతు


లక్ష్మీనగర్‌లో రూట్ మార్చ్ చేస్తున్న సీఐఎస్ఎఫ్, గోపాలపట్నం పోలీసులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు లక్ష్మీనగర్, 89వ వార్డు కొత్తపాలెంలో సీఐఎస్ఎఫ్ జవాన్లు, గోపాలపట్నం పోలీసులు సంయుక్తంగా కవాతు నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు పలు వార్డుల్లో ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ప్రజల్లోఓటు వినియోగంపై అవగాహన పెంచేందుకు .. స్వేచ్ఛగా ఎన్నికల్లో పాల్గొనేందుకు రక్షణగా ఉంటామని భరోసా ఇస్తూ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

13 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాలలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సైన్స్ విద్యార్థులకు ఈ నెల 13 నుంచి ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ క్లాసులు, ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయని అధ్యాయన కేంద్రం కో ఆర్డినేటర్ జి.రాజుకుమార్ తెలిపారు. దీనికి సంబంధించి వివరాలను విద్యార్థులకు పోస్ట్ ద్వారా పంపించామన్నారు. మరిన్ని వివరాలకు అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

అప్పన్నకు నిత్యకల్యాణం


తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణ ధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ప్రజల్లోకి విస్తృతంగా ప్రభుత్వ పథకాలు

గోపాలపట్నం: మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా శనివారం మర్రిపాలెంలోని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో 52వ వార్డు క్లస్టర్ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద కుటుంబాల్లో వెలుగులు నింపాయన్నారు. వారి అభిమానమే వైఎస్సార్‌సీపీకి బలమని పేర్కొన్నారు. బూత్ స్థాయిలో నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఐదేళ్లలో సాధించిన పారిశ్రామికాభివృద్ధి గురించి ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన లేఖలను అందించి, వాటి వివరాలను లబ్ధిదారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బీఎస్ కృష్ణ, 52వ వార్డు అధ్యక్షుడు జియ్యాని మారుతి, జేసీఎస్ క్లస్టర్ కన్వీనర్ పల్లా ఎర్నికుమార్, బూత్ లెవల్ కమిటీల సభ్యులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, బీఎస్ కృష్ణ, జియ్యాని మారుతి

కొండవాలులో అభివృద్ధి పనుల పరిశీలన

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్, గణపతినగర్ కొండ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ శనివారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కాలువలు, సీసీ మెట్ల మార్గాలు సుమారు రూ. 30 లక్షల వ్యయంతో జరుగుతున్నాయి. ఈ పనుల ప్రగతి, నాణ్యత వంటి అంశాలపై సురేష్ ఆరా తీశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చొరవతో వార్డులో ఇప్పటి వరకు సుమారు రూ.6 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు.భవిష్యత్‌లో మరో రూ. 4 కోట్ల తో మరిన్ని అభివృద్ధి పనులు చేయనున్నట్టు వివరించారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు సంపత్‌కుమార్,ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


కొండ ప్రాంతంలో పర్యటిస్తున్న పుర్రె సురేష్‌యాదవ్

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- చిల్డ్రన్ పార్కు ప్రారంభం

మల్కాపురం: నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రపథాన నిలపాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చెప్పారు. 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలో హెచ్‌పీసీఎల్–జీవీఎంసీ నిధులతో నిర్మించిన చిల్డ్రన్ పార్కును శనివారం హెచ్‌పీసీఎల్ ఈడీ రతన్‌రాజ్, వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ఏరియాకే ఆదర్శంగా పార్కు నిర్మాణం చేపట్టామన్నారు. హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆహ్లాదకరంగా నిర్మాణమైన ఈ పార్కు చిన్నారులతోపాటు పెద్దలు వాకింగ్ చేసుకోవడానికి సౌలభ్యంగా ఉంటుందని వివరించారు.హెచ్‌పీసీఎల్ ఈడీ రతన్‌రాజ్ మాట్లాడుతూ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దే ప్రణాళికలో జీవీఎంసీతో కలిసి తమ సంస్థ సీఎస్ఆర్ నిధులు అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ మేనేజర్ (హెచ్‌ఆర్) కాళీ, పార్టీ క్లస్టర్ అధ్యక్షులు బద్రీనాథ్, అంగ రాంప్రసాద్, నాయకులు ఆడారి హరీష్,పిల్లా కన్నబాబు,గుంట సుందరరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


చిల్డ్రన్ పార్కును ప్రారంభిస్తున్న ఆనంద్‌కుమార్, హెచ్‌పీసీఎల్ అధికారులు


హెచ్‌పీసీఎల్ అధికారులతో కలిసి షటిల్ ఆడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

ఇంటింటికీ పథకాలను తీసుకెళ్దాం


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని జీవీఎంసీ 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శనివారం చెప్పాడంటే.. చేస్తాడంటే కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు మేలు చేశారని, 99 శాతం ఎన్నికల హామీలు అమలు చేశారన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆనంద్‌కుమార్‌ను గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ రెట్టింపు ఉత్సాహంతో ముందుకు అడుగులు వేయాలని కోరారు. పథకాల లబ్ధిని గణాంకాలతో సహా వివరించాలని సూచించారు.

అభివృద్ధిని చూసే వైఎస్సార్‌సీపీలో చేరికలు


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో ఆడారి ఆనంద్‌కుమార్, పుర్రె సురేష్ యాదవ్

మల్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై అనేక మంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద గల ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 50 మంది టీడీపీ కార్యకర్తలు ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నక్కవానిపాలెంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో పార్టీలో చేరిన కృపానంద్, శంకర్, సురేష్, రాజు తదితరులకు ఆనంద్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా.. కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేసి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ నిలిచారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడిన జగనన్న ఈ రాష్ట్రానికి కావాలా.. లేదా పూటకో మాట, రోజుకో అబద్ధం చెప్పే మోసపూరిత నాయకుడు కావాలో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. సిద్ధం నాలుగో సభ అనంతరం టీడీపీ ఖాళీ అవడం ఖాయమన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేసే కార్యకర్తలను గుండెలో పెట్టి చూసుకునే నాయకుడు మన జగనన్న అని, రానున్న ఎన్నికల్లో ఆయనకు మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. సీఎం జగన్‌ను నమ్ముకుంటే ఇంటి వద్దకే సంక్షేమ పాలన అందుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'సిద్ధం' ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ »సిద్ధం« ఫ్లెక్సీని స్థానిక జనసేన కార్యకర్త చించివేశాడని ఆ ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి శరగడం పత్నీరావు ఆరోపించారు. ఈ ఘటనపై తాను పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అశోక్‌నగర్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ తమ పార్టీకి సంబంధించి సిద్ధం అనే పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ఫొటోలతో కూడిన బ్యానర్లు, ఫ్లెక్సీలను ఈ ప్రాంతంలో ఇటీవల ఏర్పాటు చేశామని చెప్పారు. అశోక్‌నగర్‌లోని సిద్ధం ఫ్లెక్సీని స్థానిక జనసేన కార్యకర్త ధర్మేంద్ర అనే యువకుడు బ్లేడ్‌తో సీఎం జగన్ చిత్రపటం పక్కనుంచి చింపుకుంటూ వచ్చాడని ఆరోపించారు. తమ పార్టీ, పార్టీ నాయకుల గురించి ఆ యువకుడు దుర్భాషలాడుతున్నాడన్నారు. జనసేన కార్యకర్తలు తమ పార్టీ వారిని రెచ్చగొట్టేలా ఆవేశపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఇతరులకు నష్టం జరుగుతుందని పత్నీరావు అన్నారు.



అశోక్‌నగర్‌లో చించివేసిన 'సిద్ధం'ఫ్లెక్సీ

భద్రత, పర్యావరణంపై ప్రత్యేక దృష్టి

పరవాడ: భద్రత, పర్యావరణంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు సూచించారు. జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా సింహాద్రి ఎన్టీపీసీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ విభాగంలో సింహాద్రి ఎన్టీపీసీ చేస్తున్న కృషిని అభినందించారు. భద్రత, ఆరోగ్యం, పర్యావరణ సమస్యలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఓ అండ్ ఎం జీఎం సురేష్ జాన్‌డేవిడ్ మాట్లాడుతూ సింహాద్రిలో ప్రమాద రహిత పని వాతావరణాన్ని పెంపొందించడానికి యాజమాన్యం కట్టుబడి ఉందన్నారు. ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఉద్యోగులు, కార్మికులు ఆపరేషన్ జీఎం టి.ఆర్.రాజగోపాలన్ చెప్పారు. భద్రత వారోత్సవాల్లో ఉద్యోగులు, పాఠశాలల పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన, భద్రత పోటీలు, సేఫ్టీ క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీఎం పద్మప్రియ, హెచ్‌ఆర్ హెడ్ బి.బి పాత్ర, సీఐఎస్ఎఫ్, కాంట్రాక్టు అసోసియేషన్లు ఉద్యోగులు పాల్గొన్నారు.

సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు


జోడుగుళ్లపాలెం తీరం వద్ద సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: మహాశివరాత్రి పూజలు చేసిన భక్తులతో శనివారం సాగర తీరం పోటెత్తింది. శుక్రవారం రాత్రి భక్తులు ఎక్కువమంది జాగారంతో గడిపారు. ప్రతి ఏడాది మాదిరిగా శివరాత్రి స్నానాలు కోసం ఆర్‌కే బీచ్ నుంచి జోడుగుళ్లపాలెం , సీతకొండ, రుషికొండ బీచ్‌ల వరకు అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. అన్ని బీచ్‌ల్లో లక్షకు పైగా భక్తులు వచ్చి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. తెన్నేటి పార్కు, జోడుగుళ్లపాలెం నుంచి సీతకొండ వరకు తీరంలో భక్తులు సందడి నెలకొంది. ఆరిలోవ, ఆదర్శనగర్, రవీంద్రనగర్, డెయిరీఫారం, పెదగదిలి, చినగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెంతోపాటు సింహాచలం, వేపగుంట తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఆటోలు, ద్విచక్ర వాహనాలతో తీరాలకు చేరుకున్నారు. తీరంలో స్నానాల చేసిన అనంతరం ఏడుగురు అమ్మవార్ల గుడి(కొత్తమ్మవారు)లో పూజలు చేశారు.